# సులోచన



రేడియో మోగుతుంది. అప్పుడే వచ్చిన హిందూ పేపరు చదువుతూ కూర్చున్నాను. మునిగిపోయాను యుద్ధ వార్తల్లో.

''నాన్నా! పాట చాలా బాగుంది కదూ?"

"అవునమ్మా, చాలా బాగుంది," సమాధానం చెప్పాను యాదాలాపంగా.

"సాహిత్యం బాగుందా, సంగీతం బాగుందా నాన్నా?"

"రెండూ, బాగానే వున్నాయమ్మా," అన్నాను మళ్ళీ పరధ్యానంగానే.

—"కలదీ గాలిని గారడియేమో అదియేకద ఆ ప్రేమ!"

అప్పుడే రేడియోలో వచ్చిన పాటను తన కోకిల స్వరంతో మెల్లిగా పలికింది సులోచన.

"నాన్నా, ప్రేమంటే యేమిటి నాన్నా?"

ఒక్కసారి స్మృతిలోకి వచ్చాను. అబ్బ! ఎంత పెద్ద ప్రశ్న వేసింది నా బిడ్డ. సులోచనకు ప్రేమంటే యేమిటో చెప్పగల శక్తి నాకుందా? ఏనాడో ముదిరిపోయి కుళ్ళిపోవడానికి సిద్ధంగా వున్న యీ కట్టెకు ప్రేమ అంటే అసలు అర్థం తెలుసా? తెలిసినా చెప్పగల శక్తి వుందా? అందులోను, తల్లిలేని నా బిడ్డ సులోచనకు ఎలా చెప్పగలను?

భగవంతుడా!—ఈ రోజుకోసమా నీ విన్నాళ్ళు ఎదురుచూసింది? పొరపాటున పుట్టింది సులోచన, నా కడుపున!—పేరు సులోచన—పాపం, అంధురాలు! అదీ వొక దైవికమే కాబోలు. అందుకేనా నన్ను చూస్తే నీకింత హేళన?

నాతల తిరుగిపోతూంది. ప్రేమ అనే రెండక్షరాలకు సరయిన సమాధానం చెప్పగల మగధీరు డెవరయ్యా ఈ లోకంలో—ఎవరికివారే తా మనుకున్న అర్థాన్ని వెలిబుచ్చుతూ, తమ చీకటి గదులలోని అనుభవాల పర్యవసానాన్ని లేక—నీచ లైంగిక జ్ఞానాన్ని పునరుద్ఘాటించుకొని, ఏవో కల్లిబొల్లి మాటలు చెబుతూ, ప్రజలను మోసం చెయ్యడానికి సిద్ధపడే ఈ చవట ప్రేమికులా చెప్పగలరు ప్రేమంటే యేమిటో!—

ఈ రోజువరకు—యే మహా ప్రేమికునిగానీ రోమియో-జూలియట్. అనార్కలీ-సలీము, లైలా-మజ్నూలు అనుభవించారే కాని, అది ఏమిటో వారికి తెలియదే!

"ప్రాణం" అంటే యేమిటో చెప్పగల శక్తి ఈ మానవునికి వుందా? అలాగే 'ప్రేమ' అంటేకూడా అర్థం కాదు ఈ మానవజీవికి. ప్రాణం అంటే యేమిటో చెప్పగల భగవంతుడే ప్రేమ అనే ముక్కకు గూడా సమాధానం చెప్పాలి.

"నాన్నా! యేమిటి నాన్నా, సమాధానం చెప్పవు? ప్రేమ అంటే యేమిటి నాన్నా?"

—అయ్యో!—మళ్ళీ వేదాంతంలో దిగిపోయాను. భగవంతుడే చెప్పవలసిన సమాధాన్ని నేనా చెప్పగలను! సమాధానం చెప్పకుండానే నడిచా బయటికి.

"నాన్నా - నాన్నా -నా....న్నా!"

నడుస్తున్నాను పిచ్చివాడిలాగా. వెంబడిస్తున్నాయి నా బిడ్డపలుకులు—"నాన్నా, నాన్నా, నాన్నా! ప్రేమంటే యేమిటి నాన్నా?"—

దేవుడా!—పరుగెడుతున్నాను. కాని యింకా వినిపిస్తూనే వున్నాయి ఆ బల్లెపు ములుకులు—

--ఎవరా పిలిచేది? నన్నేనా-ఆగేను.

"ఎక్కడికయ్యా పరిగెడుతున్నావు ఇలా పిచ్చివాడిలా?"-అడిగారు మా చక్రపాణి.

"ఆ—న—నమస్కారమండి! —మీ-మీ—మీకు ప్రేమంటే ఏమిటో తెలుసా?"

"ఈ వయస్సులో నీ కెందుకయ్యా ప్రేమ గొడవ!"

"నాకు కాదులెండి. అయినా చెప్పండి ప్రేమంటే ఏమిటో ?"—

"రంగా !—నీ కెప్పుడో చెప్పాను ఎక్కువగా ఆలోచించొద్దని."

"ఆలోచన నేమిటండి ? దీనికి సమాధానం మీకు చేతనయితే చెప్పండి—లేకపోతే నా దారిన నన్ను పోనివ్వండి."

మౌనం--

మళ్లీ పరిగెడుతున్నాన్ను.--

ఎంతో మంచి స్నేహితులు నన్నాపడానికి ప్రయత్నించారు-పాపం! దైవం వాళ్ళని దయజూచుగాక !--

''మామయ్యా ! మామయ్యా !—ఎందుకలా పరిగెడుతున్నారు ?"

ఆగాను—గొంతుక పరిచితమైన గొంతుకే !

"బాబూ ! నీకు ప్రేమంటే ఏమిటో తెలుసా ?"

--మౌనం.

పాపం!- అమాయకుడు. బి. ఏ. ప్యాసయి, ఈ జాతి వైషమ్యాల-నాగుపాములు బుసలు కొట్టే రోజులలో--ఉద్యోగం కూడా దొరక్క నానా యాతనలూ పడుతున్న మా రామానికి ఈ ప్రశ్నతో మతికూడా చలించింది.


"మామయ్యా ! ఇంటికి వెళదామా" అన్నాడు.

ఇంటికా !-నా కింకా సమాధానం దొరకందే ? ఎలా వెళ్ళను ఇంటికి ?—

"పద మామయ్యా, వెళదాం !"

## 2

సులోచన పుట్టుకతోనే గ్రుడ్డి కాదు. అయిదవ ఏట వాళ్లమ్మకూ దానికీ యిద్దరికీ ఒకేసారి మశూచికం వచ్చింది. వాళ్లమ్మకి ప్రాణమే పోయింది. సులోచన కండ్లు పోగొట్టుకొని యావజ్జీవ కారాగారం అనుభవిస్తూంది. ఆ రోజుల్లో కలెక్టరాఫీసులో గుమస్తా చేస్తుండేవాణ్ణి. వచ్చే డబ్బులు తిండికే సరిపోయేవి కావు. ఇక మందులెక్కడ పోయ్య




గలను?-చేతులారా పోగొట్టుకున్నాను నా భార్యను, బిడ్డను కూడా.

డబ్బు లేనివాళ్ళకు పెద్ద జబ్బులు ఎందుకు వస్తాయో తెలియదు. పెద్ద జబ్బులకు పెద్ద మందులు కావాలి. అవి డబ్బున్న పెద్దవాళ్ళకు వచ్చి డబ్బులేని బీదవాళ్ళకు చిన్న చిన్న జబ్బులు వస్తే పరవాలేదు. ఆ భగవంతుడికి ఈమాత్రం కూడా తెలియదు.

అప్పటినుంచి సులోచనకు నేనే తల్లినై పోషిస్తూ వచ్చాను. ఆఫీసు నుంచి యింటికివచ్చి వంటచేసేవాణ్ణి. యిద్దరం కలిసి భోంచేసేటప్పుడు పాపం, బాధపడేది సులోచన. "నేనాడదాన్నయివుండీ నీకు కనీసం వంటయినా వండిపెట్టే యోగ్యత లేకపోయింది నాన్నా!" అంటూ వలవల యేడ్చేది. ఓదార్చి తినిపించేవాడ్ని. మనస్సులో మట్టుకు రైళ్లు పరుగెత్తేవి-పొరపాటున నా కేమైనావచ్చి చచ్చిపోతే, నా బిడ్డగతి యేమవుతుందా అని. తలుచుకుంటేనే వణికిపోయేవాణ్ని. అబ్బే-యిప్పుడప్పుడే చావనులే అని నాలో నేనే ధైర్యం తెచ్చుకునేవాడ్ని.

కాని, నేను చచ్చేలోగా మా సులోచనను ఒక జాలిగుండె గల మహానీయుడికి వప్పగించి మరీ చావాలి—అనుకుంటూనే రోజులు గడుస్తున్నాయి. కాని యెట్లా ?

"ప్రేమ అంటే యేమిటి నాన్నా ?"

ఈ ప్రశ్న జ్ఞాపకం వచ్చేటప్పటికి వళ్లు జలదరించింది. ఆ ప్రశ్న వేసేటప్పుడే సులోచన ముఖంలో ఏదో పారవశ్యం కనిపించింది. ఆహా, అందాన్ని చూడలేకపోయినా ఆనందాన్ని అనుభవించే శక్తిమాత్రం వుండిపోతుంది కాబోలు ఈ గ్రుడ్డివాళ్ళకి !

—అంటే, సులోచన యుక్త వయస్సురాలయిందన్నమాట. తను చూడలేని ప్రపంచాన్ని అనుభవించటానికి ప్రయత్నిస్తుంది అమాయకంగా. ఎలా నచ్చజెప్పను, నా బిడ్డకు !-గ్రుడ్డిదాన్ని పెళ్ళిచేసుకోడానికి ఏ మహాత్యాగి కూడా ముందడుగు వెయ్యడన్న సంగతి ఆమెకి ఎలా తెలియజెప్పడం ?

రామం, నేనూ యింటికి చేరుకున్నాం. లోపలినుంచి 'నాన్నా' అని కేక వినిపించింది. భయం వేసింది. మళ్లీ ఆప్రశ్నే వేస్తే ఏమి సమాధానం చెప్పాలో అని వణికిపోయాను.

"ఏం నాన్నా, మాటల్లోనే వెళ్ళిపోయావు, ఇంత పొద్దెక్కేదాకా ఎక్కడున్నావు నాన్నా ? నువ్వింకా రాలేదని పొయ్యంటించి ఎసరు పెడదామని కిరస

వెతికాను, దొరకలేదు. పైగా అగ్గిపెట్టె ఎక్కడ పెట్టావో తెలియదు,'' అంటూ అన్నీ ఏకరువు పెడుతూంది.

నాకు స్పృహ తప్పినట్టయింది. పొరపాటున కిరసనాయిలుగాని వంటి మీద పడివుంటే ? అగ్గిపుల్ల గీసేటప్పుడు కోక నిప్పంటుకుంటే ?_ జేబులో అగ్గిపెట్టె తడుముకుని, గండం తప్పినట్టుగా భావించి సంతోషించాను. కళ్ళ నీరు కారుస్తూ అలా నిలబడిపోయాను.

ఇంతవరకు నేను మాటాడక పోవటం చూచి ఏమనుకుందో యేమో. బిక్కమొగం వేసింది. "నాన్నా!'' అంటూ దగ్గరకు రాబోయింది. నేనే దగ్గరికి వెళ్ళి "లేదమ్మా, ఏదో ఆఫీసు పని జ్ఞాపకమొచ్చి, చటుక్కున లేచి వెళ్ళిపోయాను. నువు కాస్సేపు అలా కూర్చో ఒక్క నిమిషంలో వంట చేసేస్తాను'' అని ఒక పక్క కూర్చోబెట్టి వంటింట్లోకి వెళ్ళాను.

నా వెనకాలే మా రామంకూడా రావడం అలికిడి విన్నట్టుంది. "అదెవరు నాన్నా!" అని అడిగింది. "నేనే సులోచనా!'' అన్నాడు రామం

పాపం, సిగ్గుపడింది. తా నింతవరకు పరాయి మగవాడి యెదుట సిగ్గు విడిచి నాతో మాట్లాడానని కాబోలు!

"మామయ్య బజారులో కనబడి యింటికి రమ్మని పిలిచాడు" అని బొంకాడు రామం.

"ఎందుకు ? నీకు విందు పెట్టాడానికా!" అంది సులోచన నవ్వుకుంటూ.

రామం నావంక చూసి నవ్వుకుంటూ వంటింట్లోకి వచ్చాడు.

భోజనానంతరం—

సులోచనను విశ్రాంతి తీసుకోమని చెప్పి బయటకు బయలుదేరాం.

"రామం!_చూశావుకదూ సులోచన ప్రేమ ఎలా వుందో. నేను బతికుండగానే ఒక వుద్యోగంలో వున్న మంచి కుర్రవాణ్ని చూసి పెళ్ళిచేసేస్తే, తరవాత నేను చచ్చిపోయినా ఫరవాలేదు. అందుకని తెగ వెతుకుతున్నాను రామం! నువుకూడా కాస్త సహాయం చేద్దూ!''

"అలాగే మామయ్యా! తప్పకుండా చూస్తాను. కాని-గుడ్డిపిల్లని చేసుకోడానికి ఎవరు ఒప్పుకుంటారా అనేదే అనుమానంగా వుంది."

"అదేబాబూ, నేను భయపడేదిన్నూ. కాస్త ప్రయత్నిస్తే, ఏ త్యాగమూర్తి అన్నా దొరక్కపోడు. నువు తలుచుకుంటే ఏదన్నా చేయగలవు. కాస్త చూసిపెట్టు బాబూ!"

రామం సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.



## 3

సుబ్రమణ్యం కొత్తగా ఆఫీసులో చేరాడు. నా చేతి కింద గుమాస్తాగానే పని చేస్తున్నాడు. మంచి కుర్రవాడే కాని సిగరెట్లు కాలుస్తాడు. ఛ--ఛ!-వద్దు

రమణమూర్తి బాగానే వుంటాడు. బుద్ధిమంతుడే. బి. ఏ. కూడా ప్యాసయినాడు. కాని స్వార్థం ఎక్కువ కనిపిస్తుంది మనిషిలో. పైగా, గొప్పయింటి వాడిననే అహంభావం కూడా వున్నట్టుంది. నేను మాత్రం ఏం తక్కువ వాడినా ? తహశ్శీల్దారు వుద్యోగం చేస్తున్నాను !-అయినా అడిగిచూస్తే తప్పేముంది ? - "ఏమంటావు, రామం!"

"అలాగే మామయ్యా, అడిగి చూడు!''




మధ్యాహ్నం 'రీసస్' లో ధైర్యం చేసి అడిగాను రమణమూర్తిని. నా కేసి చూసి ఓ చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. ఎంత అహం మనిషికి!-మళ్లీ నే నాఫీసులోకి తిరిగి వెళ్ళేసరికి అందరూ నాకేసి చూసి నవ్వుకుంటున్నారు. కొంత సేపాగి, అందరూ ఒక్కసారిగా గొల్లుమని నవ్వారు!-చిత్రవధ అనుభవించాను. ఇంతకంటె ఆత్మహత్య మేలు!—

మర్నాడు ఆఫీసుకి వెళ్లేసరికి నా బల్లమీద ఒక కాగితం పెట్టివుంది.

"గ్రుడ్డిదానికి గ్రుడ్డివాడిని వెతకడం మంచిది. కళ్లున్న గ్రుడ్డివా డెవడూ దొరకడు."...

## 4

సెలవు పెట్టాను ఉద్యోగానికి ఒకనెల.

నాకు జరిగిన పరాభవం తలుచుకుని ఏడ్చేవాణ్ణి. సులోచన "ఏం నాన్నా, ఆఫీసుకు వెళ్ళడం లే" దని అడిగింది. వంట్లో బాగోలేక సెలవు పెట్టానని చెప్పాను. కాని నా బాధ ఎవరితో చెప్పుకోను?...

వినేవాళ్లు లేక ఎక్కువయింది కడుపులో మంట. మా రామంకూడా ఒక నెల రోజుల్నించి కనుపించడంలేదు. ఒకవేళ అతనిక్కూడా యీ సంగతి తెలిసి న న్నసహ్యించుకున్నాడేమో! మతిపోయి, పిచ్చివాడ్నయిపోయాను.

ఒక రోజున అరుగుమీద కూర్చున్నాను. ఎక్కడినుంచి వచ్చాడో, మా రామం హుషారుగా వచ్చాడు.

"మామయ్యా, నాకు ఉద్యోగం దొరికింది మామయ్యా!"

"చాలా సంతోషం. ఎక్కడబాబూ?"

"బెజవాడలో మామయ్యా. రెవిన్యూ డిపార్టుమెంటులోనే దొరికింది."

"అంటే-బెజవాడ వెళ్ళిపోతావన్న మాట. అసలు-నెలరోజులనుంచి నువు కనబడకపోయేసరికి, నువు కూడా నాకు దూరమయిపోయావనుకున్నాను. కాని వచ్చినట్టే వచ్చి, మళ్లీ వెళ్లిపోతానంటున్నావు. అలాగే కానియ్యి.. నా కోసం నీ ఉద్యోగం మాత్రం మానుకోగలవా?"

మౌనం....

"చూడు, రామం!-పోనీ? అప్పుడప్పుడన్నా ఒక్కసారి వస్తూండు. అట్టే దూరం లేదుగా? నిన్ను చూస్తే మా చెల్లమ్మను చూసినట్టుంది."

మౌనం....

"రామం! నే నెంతకాలం బ్రతికుంటానో తెలియదు. ఒకవేళ ఏదయినా జరిగితే, కాస్త సులోచనను మాత్రం కనిపెట్టుండు నాయనా! అదే నే కోరేది."

"మామయ్యా!— నాకు వుద్యోగం వచ్చిన సంగతి చెబితే సంతోషిస్తావనుకున్నాను. ఏమిటి మామయ్యా యిలా బాధపడుతున్నావు?"

"నాన్నా, నాన్నా!" అని పిలిచింది సులోచన. లోపలికి వెళ్లాను.

"బావకు కాఫీ తెచ్చాను నాన్నా!"

"ఆఁ!-కాఫీయా!-ఎవరు కాచారు?"

"నేనే నాన్నా!"

"ఒరే రామం! రామం!-చూశావట్రా నీకోసం కాఫీ కాచిందిరా మా సులోచన. "రామం - రామం!-"

రామం వెళ్ళిపోయాడు. మా రామం!

అరె!-తన కళ్ళజోడు కూడా వదిలి వెళ్ళిపోయాడే? "రామం- రామం!-"

"మామయ్యా, లోపలున్నాను!"

"ఇదుగో కళ్ళజోడు-అక్కడ వదిలేశావురా!"

"అవి నా కెందుకు మామయ్యా నా సులోచనాలు యివిగో!-" అంటూ, నా బిడ్డను దగ్గరకు చేరదీసుకున్నాడు!"